క్లుప్తంగా

వెండి వస్తువులు బహూకరణ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలోని ఉపాలయ సహదేవతలు వినుకొండ అంకమ్మ, మద్దిరావమ్మ, పెద్దమ్మవారికి సోమవారం గ్రామానికే చెందిన కన్నేటి వెంకటరమణ, విజయలక్ష్మీ దంపతులు రూ.25వేల విలువ కలిగిన వెండి వస్తువులు బహుకరించారు. ఆలయ ఈఓ కిషోర్‌కుమార్ చేతుల మీదుగా వస్తువులను ఆలయానికి అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

శంభులింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

నందిగామ రూరల్: మండలంలోని గోళ్లమూడిలో వేంచేసియున్న పార్వతి సమేత శంభులింగేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష అభిషేకాలు చేశారు. ఏకాదశి సోమవారం సందర్భంగా స్వామి వారికి పలు రకాల పండ్ల రసాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

నందిగామటౌన్: రానున్న వేసవి దృష్ట్యా పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తెలిపారు. పట్టణంలోని ఆయా ప్రాంతాలలో ఉన్న వాల్వ్‌పిట్‌లను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా తాగునీరు సరఫరా కాని ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తామని వివరించారు.

క్రీడామైదానం మధ్యలో కోర్టుల ఏర్పాటు



పెనుగంచిప్రోలు: ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకం కింద పెనుగంచిప్రోలు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లోని క్రీడామైదానం మధ్యలో రూ.5లక్షలతో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఈ కోర్టులను క్రీడామైదానం మధ్యలో ఏర్పాటు చేస్తుండటంతో క్రికెట్ ఆడేందుకు ఇబ్బంది అవుతుందని స్థానిక క్రీడాకారులు చెబుతున్నారు. ఏటా గ్రామ క్రీడాకారుల ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్లు కూడా ఈగ్రౌండ్‌లోనే సాగుతుంటాయి. గ్రామం అంతటికి క్రికెట్ ఆడేందుకు ఈ ఒక్క గ్రౌండ్ మాత్రమే ఉన్నందున ఖోఖో, వాలీబాల్ కోర్టులను మైదానంలో ఓ పక్కగా ఏర్పాటు చేస్తే బాగుంటుందని గ్రామానికి చెందిన క్రీడాకారుడు యర్రంశెట్టి నాగబాబుతోపాటు స్థానిక క్రీడాకారులు కోరుతున్నారు. ఆదిశగా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

పైపులైన్‌కు మరమ్మతులు



కంచికచర్ల : మండలంలోని కీసర పాత బ్రిడ్జిపై రక్షిత మంచినీటి సరఫరా పథకం ద్వారా సరఫరా అయ్యే తాగునీటి ప్రధాన పైప్ లీకేజీకి గురికావడంతో సోమవారం గండేపల్లి సర్పంచి బి.రవికుమార్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ రెండు రోజుల కిందట కీసర పాత బ్రిడ్జి మీదుగా వచ్చే రక్షిత మంచినీటి పథకం అయ్యే ప్రధాన పైపు లీకేజీకి గురికావడంతో మరమ్మతులు చేపట్టి, నూతన పైపును ఏర్పాటు చేసినట్లు వివరించారు. రానున్న వేసవికాలంలో గ్రామానికి తాగునీటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కేసు నమోదు

నందిగామటౌన్: బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ బంగార్రాజు హెచ్చరించారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ నందిగామ ఎక్సైజ్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం చట్ట విరుద్ధమన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే సహించేది లేదని తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ ఈఎస్‌టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో జనాన్ని ముంచారు



యువతపోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు



యువత పోరు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ రూరల్: కూటమి నేతలు అబద్ధపు హామీలతో ప్రజలను నమ్మించి నట్టేట ముంచారని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాల ముఖ్య నాయకులు, విద్యార్థులు, యువతతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత ఈనెల 12న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'యువత పోరు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఎన్నికలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం అమలుచేయకపోవడం దారుణమన్నారు. యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

ప్రైవేట్ పరమవుతున్న మెడికల్ కాలేజీలు..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కింద సగం సీట్లను కేటాయిస్తే మెడికల్ సీట్లను అమ్మేస్తున్నారంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్...నేడు ఏకంగా మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తున్నామని వారే చెబుతున్నారంటూ మండిపడ్డారు. మన రాష్ట్రానికి చెందిన విద్యార్థులు వైద్య విద్యనభ్యసించేందుకు పక్క రాష్ట్రాలు, విదేశాలకు వెళ్లకుండా ఇక్కడే నాణ్యమైన వైద్య విద్యనందించాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వైద్య కళాశాలలకు నేడు కూటమి ప్రభుత్వం దుర్గతి పాలు చేస్తోందని ఆవేదనవ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వంలో పేద విద్యార్థులకు వైద్యవిద్య అందని ద్రాక్షలా మారిందన్నారు.

యువత పోరును విజయవంతం చేద్దాం : తన్నీరు

జగ్గయ్యపేటఅర్బన్: కూటమి ప్రభుత్వం హామీలను నమ్మి మోసపోయిన యువత, నిరుద్యోగులకు మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన కలెక్టరేట్ వద్ద చేపట్టే యువత పోరు కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి యువత పోరు పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంటు పథకాన్ని కూటమి ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలు 3,900 కోట్లు ఉంటే బడ్జెట్‌లో కేవలం రూ 2,600 కోట్లు మాత్రమే కేటాయించారని, తద్వారా విద్యార్థుల సంఖ్యను తగ్గించేందుకే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. నిరుద్యోగ భృతి రూ.3వేలు, 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీలు ఇచ్చి బడ్జెట్‌లో ఎక్కడా వీటి ప్రస్తావన తీసుకురాలేదని గుర్తుచేశారు. నిరుద్యోగులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ యువత పోరు కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు వట్టెం మనోహర్, జిల్లా కార్యదర్శి వేముల మల్లేశ్వరరావు, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ నంబూరి రవి, పార్టీ కార్మిక విభాగం అధ్యక్షుడు గంగోలు వినోద్, ప్రచార విభాగం అధ్యక్షుడు గోగుల వెంకయ్య, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, న్యాయవాది శివరాత్రి పృథ్వీ, మాజీ సొసైటీ అధ్యక్షుడు అన్నాబత్తుల శ్రీనివాసరావు, గౌరవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎ.కిషోర్, మండల అంగన్‌వాడీ మహిళా అధ్యక్షురాలు శ్యామల, దివ్యాంగుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బాబురావు, బీసీ సంఘ నేత జవ్వాజి నరసింహారావు, నాయకులు బీఎస్ఎన్ఎల్ రామారావు, దార్ల ప్రసన్నకుమార్, బండి రాజు, ఎం.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష హోదా ఇచ్చేందుకు భయమెందుకు..

ప్రజల ఆకాంక్షలను అసెంబ్లీలో ప్రస్తావించడంతోపాటు మీరు ఇచ్చిన అసత్యపు హామీలపై నిలదీస్తారనే భయంతోనే జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం భయపడుతోందని మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు విమర్శించారు. కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికే పరిస్థితి పూర్తిగా అవగతమైందన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు గట్టిగా సమాధానం చెబుతారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 40శాతం ఓటు ఉన్న పార్టీగా ప్రజల తరఫున పోరాడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చందర్లపాడు జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, ఎంపీపీ ఆకుల హనుమంతరావు, చందర్లపాడు మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వైఎస్ఎన్ ప్రసాద్, వెలగపూడి వెంకటేశ్వరరావు, ములకలపల్లి కృష్ణమోహన్, చింతోటి ప్రసాద్, చిలుకూరి బుచ్చిరెడ్డి, బుగ్గినేని సురేష్, సింగంశెట్టి మల్లికార్జునరావు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

బంజరు భూములను పేదలకు పంచాలని డిమాండ్



తహసీల్దార్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


వీరులపాడు:మండలంలోని అటవీ బంజర భూమిని నిరుపేదలకు ఎకరం చొప్పున పంపిణీ చేసి వరాల జీవనోపాధికి తోడ్పాటునందించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘం రాష్ట్ర నాయకుడు జెల్లి కారల్‌మార్క్స్ కోరారు. అటవీ బంజర భూములను పేదలకు మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని జుజ్జూరు గ్రామంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రంగాపురం, గొట్టుముక్కల, తిమ్మాపురం, చెన్నారావుపాలెం గ్రామ సమీపంలో సుమారు 600 ఎకరాల బంజర భూమి హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలకు చెందిన పారిశ్రామికవేత్తల ఆక్రమణలో ఉందని ఆరోపించారు. ఆక్రమిత భూమిలో పారిశ్రామికవేత్తలు పలు రకాల పండ్ల సాగు చేపడుతున్నారన్నారు. ఆ భూములను వారి వద్ద నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ హుస్సేన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తొమ్మిది అర్జీలు



నందిగామ టౌన్:పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తొమ్మిది అర్జీలు అందినట్లు తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఆరు అర్జీలు, పోలీసుశాఖకు రెండు, ఆర్‌అండ్‌బీ శాఖకు ఒక అర్జీ అందినట్లు వివరించారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖాధికారులకు పంపించి సకాలంలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఆర్డీఓ వివరించారు.

బాలిక విద్యకు సావిత్రీబాయి పూలే కృషి



సావిత్రీబాయిపూలేకు నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: మహిళా విద్యాసంస్థలను స్థాపించి జీవితాంతం మహిళా విద్య కోసం, మహిళల అభివృద్ధి కోసం కృషిచేసిన సావిత్రీబాయి పూలే సేవలు స్ఫూర్తి దాయకమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక విజయవాడ రోడ్‌లోని సావిత్రీబాయి పూలే విగ్రహానికి పలువురు బీసీ నేతలతో కలిసి తన్నీరు నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మొట్ట దటి బీసీ మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె జీవితం బడుగు, బలహీనవర్గాల విద్యావ్యాప్తికి కృషిచేసిందని ఆమె సేవలను కొనియాడారు. బాలికా విద్యను స్వయంగా ప్రోత్సహించి నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు.కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు వట్టెం మనోహర్, జిల్లా కార్యదర్శి వేముల మల్లేశ్వరరావు, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ నంబూరి రవి, పార్టీ కార్మిక విభాగం అధ్యక్షుడు గంగోలు వినోద్, ప్రచార విభాగం అధ్యక్షుడు గోగుల వెంకయ్య, పట్టణ యూత్ ప్రధాన కార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, న్యాయవాది శివరాత్రి పృథ్వీ, మాజీ సొసైటీ అధ్యక్షుడు అన్నాబత్తుల శ్రీనివాసరావు, గౌరవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎ.కిషోర్, మండల అంగన్‌వాడీ మహిళా అధ్యక్షురాలు శ్యామల, దివ్యాంగుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బాబురావు, బీసీ సంఘ నేత జవ్వాజి నరసింహారావు, నాయకులు కన్నమాల శామ్యూల్, బీఎస్ఎన్ఎల్ రామారావు, దార్ల ప్రసన్నకుమార్, బండి రాజు, ఎం.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో...

టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. కమలా థియేటర్ సెంటర్‌లోని సావిత్రీబాయి పూలే విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, పార్టీ నేతలు స్థానిక విజయవాడ రోడ్‌లోని సావిత్రీబాయి పూలే విగ్రహానికి నివాళులర్పించారు మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాబు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీ 'గురుకులం'లో ప్రవేశాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో భవానీపురంలో నిర్వహిస్తున్న ఏపీఆర్ఎస్ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.శివకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 40 సీట్లు, 6, 7, 8 తరగతులలో(బ్యాక్ లాగ్) మిగిలి ఉన్న సీట్ల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీట్ల భర్తీలో ముస్లిం (బీసీ–ఇ, బీసీ–బీ, బీసీ–సీ (కన్వర్టెడ్ క్రిస్టియన్) విద్యార్థినులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఏజిల్లాకు చెందిన విద్యార్థి అయిన దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 8712625036 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పైపులైన్ పనులను నిలుపుదల చేయాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



వీరులపాడు: మండలంలోని నందలూరు గ్రామ సమీపంలోని వైరా కట్టలేరులో సెంథినీ కర్మాగారం చేపడుతున్న పైపులైను ఏర్పాటుతో పరిసర ప్రాంత ప్రజలు తాగు, సాగునీటికి అవస్థలు పడాల్సి వస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ అన్నారు. సెంథినీ కర్మాగారం చేపడుతున్న పైపులైన్ పనులను శాశ్వతంగా నిలుపుదల చేయాలని కోరుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రైతులతో కలసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నందలూరు గ్రామ సమీపంలో సెంథినీ కొత్త కర్మాగారం ఏర్పాటు చేసేందుకు 1.50ఎకరాల భూమిని కొనుగోలుచేసి ఫ్యాక్టరీకి అవసరమైన నీటికోసం బోర్లు వేసేందుకు సిద్ధపడుతున్నారన్నారు. బోర్లు, పెద్దపెద్ద మోటార్ల ద్వారా నీటిని తరలించేందుకు కర్మాగారం ప్రతినిధులు యతిస్తున్నారన్నారు. అదే జరిగితే నందలూరు, గండేపల్లి, బోడవాడ, జమ్మవరం, తదితర గ్రామాల ప్రజలు తాగు, సాగునీటి ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. గతంలో కూడా కీసర మునేటిలో బోర్లు వేశారని ప్రజల ఇబ్బందుల దృష్ట్యా అప్పటి అధికారులు నిలుపుదల చేశారని గుర్తుచేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్ ఏర్పాటు ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు కొప్పుల రాము, కిలారు బాబురావు, ఏలూరు సురేష్, బెల్లంకొండ కోటేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, సంద్ర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాలు



ఆలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు



యాగశాలలో పూజలు చేస్తున్న అర్చకులు

మక్కపేట(వత్సవాయి):గ్రామంలో పార్వతి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ, ధ్వజ ప్రతిష్ఠ, గంగానమ్మ తల్లి ఆలయ విగ్రహ, ఆలయ నూతన ప్రతిష్ఠా మహోత్సవాలను గ్రామస్తులు సోమవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు యలమంచలి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మూడు రోజులుగా హోమాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఉదయం భక్తుల జయజయ ధ్వానాల నడుమ ప్రతిష్ఠను నిర్వహించారు. అనంతరం శాంతి కల్యాణం జరిపించారు. భక్తులకు భారీ అన్నదానం చేశారు. ప్రతిష్ఠ మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, గ్రామసర్పంచ్ మల్లెల శివ, ఎంపీటీసీ సభ్యురాలు ఆళ్ల కుమారి, సొసైటీ మాజీ అధ్యక్షులు కనగాల రమేష్, కొండబోలు బ్రహ్మం, మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షులు మల్లెల గాంధీ, తెలుగుయువత నాయకులు శ్రీరాం చినబాబు, నాయకులు కె.భాస్కరరావు పాల్గొని స్వామివార్లను సందర్శించి పూజలు చేశారు. అర్చకులు కెవైఎస్ శర్మ, యుగంధర్‌శర్మ, సంగయ్యశర్మ, హనుమంతరావు, రాఘవశర్మ, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ పునః నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.50 లక్షలు మంజూరుకాగా, గంగానమ్మ ఆలయానికి కూడా టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ.10 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిధులతో ఆలయాన్ని పునఃనిర్మించి ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పనిభారం తగ్గించాలని కార్యదర్శుల వినతి



ఇన్‌చార్జి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామకార్యదర్శులు

వీరులపాడు: గ్రామ కార్యదర్శులపై మోపుతున్న అధిక పనిభారాన్ని తగ్గించాలని ఆయా గ్రామాల కార్యదర్శులు కోరారు. పనిభారాన్ని తగ్గించాలని కోరుతూ మండలంలోని ఆయా గ్రామాల కార్యదర్శులు ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతారామరాజును సోమవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యంతోపాటు మిస్సింగ్ సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయిస్ సర్వే, హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్, పలురకాల వీడియో కాన్ఫరెన్స్‌ల కారణంగా పనిఒత్తిడి పెరిగి మానసిక వేదనకు గురవుతున్నామన్నారు. తమపై పడుతున్న పనిభారాన్ని తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు సాంబశివరావు, మీర్జావలి, వీరభద్రరావు, రాజశేఖర్, రాణి, ప్రియాంక, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

రామకోటి మహోత్సవాలు



అలివేలుమంగ పద్మావతి సమేత శ్రీనివాసుని కళ్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

నందిగామరూరల్: పట్టణంలో వేంచేసియున్న సీతారామాంజనేయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న 72వ శ్రీరామకోటి మహోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. మహోత్సవాలలో భాగంగా సోమవారం వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో అలివేలుమంగ పద్మావతి సమేత శ్రీనివాసుని కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన భక్తి సంకీర్తనలు, కూచిపూడి భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీనివాస, నారద, తుంబుర, బ్రహ్మదేవతా మూర్తుల విగ్రహాలతో కూడిన సెట్టింగ్ ప్రత్యేకాకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో సీతారామనామ సంకీర్తనా సంఘ సభ్యులు, అర్చకులు దివి రత్నమాచార్యులు, అధోక్షజాచార్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆందోళన



గాంధీ సెంటరులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నందిగామటౌన్: రాయచోటిలో వీరభద్రస్వామి ఊరేగింపు మహోత్సవంలో హిందువులపై జరిగిన దాడి హేయమైనదని విశ్వహిందూ పరిషత్ సభ్యులు తొర్లికొండ సీతారామయ్య, వాచస్పతి, అడపా స్వామి అన్నారు. దాడిని నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గాంధీ సెంటరులో ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆర్డీవో బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హిందువులపై దాడిచేసి గాయపరిచి తిరిగి వారిపైనే కేసులు నమోదు చేయించడం బాధాకరమని తెలిపారు. పక్షపాత వైఖరి అవలంభించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కామేశ్వరరావు, అశోక్‌శర్మ, పూజారి రాజేష్, వడ్డెల్లి సుధాకర్, కనితి సుబ్బారావు, కోవెలమూడి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సమస్య లేకుండా చూడాలని మున్సిపల్ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ మున్సిపల్ అధికారులను కోరారు. ఆయన సోమవారం గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. పైఅంతస్తుకు తాగునీరు సరిగా అందడం లేదని, స్నానాలు చేయడానికి నీటి సమస్య ఉందని విద్యార్థులు తమ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. విద్యార్థులను చూడటానికి వచ్చే తల్లిదండ్రులు ఎండలోనే గంటల తరబడి బయట నిలబడాల్సి వస్తోందని, ఆవరణలో బెంచీలు ఏర్పాటు చేయడంతోపాటు తల్లిదండ్రులను లోపలికి అనుమతించాలని పాఠశాల సిబ్బందిని ఆయన కోరారు.దోమలు, కోతులు, వీధి కుక్కలు బెడద ఉందని విద్యార్థులు తెలియజేయడంతో మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

నందిగామరూరల్: విద్యుత్ చౌర్యానికి పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణకుమారి హెచ్చరించారు. విద్యుత్ శాఖ రూరల్ సెక్షన్ పరిధిలోని ఆయా గ్రామాల్లో విజిలెన్స్ అధికారులు సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 105మంది సిబ్బంది 33 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. 2,460 విద్యుత్ కనెక్షన్లను తనిఖీ చేసి అనుమతించిన లోడుకు మించి విద్యుత్ వినియోగిస్తున్న 330మందిని గుర్తించడంతోపాటు వారికి రూ. 42,740ల అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో డివిజినల్ ఇంజనీర్ వసంతకుమార్, డీపీడీఈ విజయకుమారి, డిప్యూటీ ఇంజనీర్ స్టాలిన్‌కుమార్, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచితంగా నీటితొట్లు పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంభవ జీవదయ గ్రూప్ చారిటీ వారు భవానీపురం ఐరన్ యార్డ్‌లోని జీవకారుణ్య ఆశ్రమం ద్వారా మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మంచినీటి తొట్లను పంపిణీ చేయనున్నట్లు ఆశ్రమం నిర్వాహకులు మురాల వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవికాలంలో మూగజీవుల దాహార్తిని తీర్చాలనుకునే జంతుప్రేమికులకు ఈ తొట్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.